# తల్లిదండ్రులు, అధ్యాపకులు పిల్లలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి

చదువులన్నియు చదివి చాల వివేకియై
మదిని తన్నెఱుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను
హీను డవగుణంబు మానలేడు
తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్నియు చదివి చావంగనేటికి!
చావు లేని చదువు చదువవలయు

ఆచరణలో లేని చదువులు ఎన్ని చదివినా ప్రయోజనం లేదు. ఎన్ని బిరుదులు పొందినప్పటికీ, ఎన్ని డిగ్రీలు తీసుకున్నప్పటికీ చదివిన చదువును ఆచరణలో పెట్టనివాడు అల్పుడేగాని, విద్యావంతుడు కాడు. ఈనాడు అజ్ఞానులు ఎవరంటే, ఎక్కువ చదువులు చదివి ఆచరణలో పెట్టనటువంటివారే పెద్ద అజ్ఞానులు. పిల్లలుకూడా వారినే అనుసరిస్తూ, వారి అడుగుజాడలలో నడుస్తున్నారు.

(ఆనాటి సమావేశంలో ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలకు భగవాన్ అనుగ్రహించిన సమాధానాలను ఈ క్రింద ప్రచురిస్తున్నాము)

**ప్రశ్న 1 : విద్యార్థులు భగవంతునితో ఎట్లా సంబంధం పెట్టుకోవాలి?**

భగవంతుడు నీకంటే ప్రత్యేకంగా బయట లేదు; నీలోనే ఉన్నాడు. నీలో ఉన్నటువంటి భగవంతునిపట్ల నీవు ప్రేమను కలిగియుండాలి. భగవంతుడు ప్రత్యేకంగా ఒకచోట

sri sathyasai vahini amrutam

ఉన్నట్లయితే అతనితో సంబంధ బాంధవ్యములు పెట్టుకోవచ్చును. కాని, భగవంతుడు ఎక్కడో ప్రత్యేకంగా లేడు. God is in you, with you, above you, below you, behind you. అలాంటి భగవంతునితో సంబంధం పెట్టుకోవడమంటే ఏమిటి? అది భౌతికమైన సంబంధం కాదు. నీవూ భగవంతుడూ ఒకటే అని భావించాలి. 'భగవంతుడు నాలోనే ఉన్నాడు' అనే విశ్వాసాన్ని నీవు అభివృద్ధి పరచుకోవాలి.

**ప్రశ్న 2 : ఆధ్యాత్మికంగా కలిగే పరిణామానికి గుర్తులేమిటి?**

భగవంతుణ్ని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నానా? లేక, ఏదో ప్రాపంచికమైన భావంతో జీవిస్తున్నానా? అని నిన్ను నీవు పరీక్ష చేసుకోవాలి. "కష్ట సుఖములు రెండింటియందుకూడను నేను ఏకభావముతో జీవిస్తున్నాను" అనే నమ్మకం నీకు సంపూర్ణంగా కలగాలి. దీనికి సంబంధించిన కొన్ని విధములైనటు వంటి సూచనలు అప్పుడప్పుడు నీకు భౌతికంగాను, స్వప్నమునందును కనిపించవచ్చును, లేక వినిపించవచ్చును. ఇంతకుమించి ఆధ్యాత్మికంగా కలిగే పరిణామానికి ప్రత్యేకమైన గుర్తులేమీ లేవు. నీయందు భక్తి పెరుగుచున్నదా? తరుగుచున్నదా? అనే విషయాన్ని నీకు నీవే గుర్తించుకోవాలి. నీయొక్క విశ్వాసంపైననే నీవు ఆధారపడి ఉంటుండాలి.

**ప్రశ్న 3 : సాయి విద్యావిధానంలో అధ్యాపకులకు ఏవిధమైనటువంటి గుణములుండాలి? అధ్యాపకుడు ఏవిధంగా మెలగాలి? విద్యార్థులతో క్రమశిక్షణ ఏవిధంగా పాటింపజేయాలి?**

అధ్యాపకులు విద్యార్థులను అణకువతో, మన్నించే మాటలతో అదుపులో పెట్టాలి. 'వీరు నా విద్యార్థులు కదా' అని వారిని ఇష్టానుసారంగా వదలిపెట్టకూడదు. వారికి కొంతవరకు స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ, మధ్య మధ్యలో 'బ్రేకు' వేస్తూ రావాలి. అవసరమైనప్పుడు శిక్షించాలి. ఈ శిక్ష అనేది ఒక హెచ్చరికగా ఉండాలి. అధ్యాపకుడు అధ్యాపకుని స్థాయిలోనే ఉండి, స్టూడెంట్లును స్టూడెంటు స్థాయిలోనే ఉంచి, క్లాసు రూమ్‌లో అందరికీ తగినటువంటి సదుపాయములను కలిగించి, అందరినీ సంతోషపెట్టేటటువంటి విధంగా జాగ్రత్తగా మెలగాలి.

**ప్రశ్న 4 : మానవతా విలువలలో ఆదర్శమూర్తిగా రూపొందటానికి అధ్యాపకుడు ఏవిధంగా**

sri sathyasai vachanamrutam

ప్రయత్నించాలి?

ఇదే చాలా ముఖ్యమైనటువంటిది. అధ్యాపకుడు స్టూడెంట్స్‌తో సరియైన రీతిగా ప్రవర్తించాలి. అప్పుడే స్టూడెంట్స్‌కూడను తనను అనుసరిస్తారు. అధ్యాపకుడు స్టూడెంట్స్‌కు ఏది చేయకూడదని చెపుతున్నాడో అది తాను చేయకుండా ఉండాలి. ఇంతియేకాకుండా, స్టూడెంట్స్‌కు ఏవిధమైన ఆహారమును భుజించాలని చెపుతున్నాడో తానుకూడను అట్టి ఆహారమునే భుజించాలి. "మీరు మాంసము, చేపలు తినకూడదు" అని విద్యార్థులకి చెప్పి తాను మాత్రం తింటూ ఉంటే, పిల్లలు అతని మాటలను ఎలా అనుసరిస్తారు! పిల్లలకు చెప్పినటువంటిది మొట్టమొదట తాను స్వయంగా ఆచరించి చూపాలి. 'నేను టీచరును కదా' అని అహంకారంగా, ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించకూడదు. పిల్లలతో అణకువగాను, మెలకువగాను, వినయంగాను, ప్రేమగాను మెలగాలి.

ఇంక, క్లాసులో కేవలం మగపిల్లలే ఉంటే ఫరవా లేదుకాని, ఆడపిల్లలుకూడా ఉన్నప్పుడు అధ్యాపకుడు మరింత జాగ్రత్తగా, సరియైనరీతిగా ప్రవర్తించాలి. ఆడపిల్లలను తన సిస్టర్స్‌గా భావించాలి. తన స్వంత సిస్టర్స్‌ని ఏవిధంగా తాను గౌరవిస్తూ, ఆనందింపజేస్తూ ఉంటాడో అదేవిధముగా వారినికూడా ఆనందింప జేయాలి. అప్పుడే వారికి చక్కని గుణముకూడను తాను నేర్పినటువంటి వాడవుతాడు. ఈవిధంగా, తాను ఆదర్శవంతమైనటువంటి జీవితాన్ని గడుపుతూ, స్టూడెంట్స్‌కు బోధించాలి.

**ప్రశ్న 5 : పిల్లలయొక్క చదువు విషయంలో తల్లిదండ్రులను ఎట్లా పాలుపంచుకునేటట్లు చేయాలి?**

ముఖ్యంగా పిల్లలకు తాము ఏది బోధిస్తున్నారో దానిని తల్లిదండ్రులుకూడను అనుసరిస్తూ రావాలి. అప్పుడే పిల్లలు మంచివారుగా తయారవుతారు. పిల్లల ఎదుట తల్లిదండ్రులు సంసార విషయములు ఏమాత్రం చర్చించకూడదు. ఇంతేకాకుండా, తమకున్నటువంటి కష్టాలను, ఆర్థికపరమైన ఇబ్బందులను పిల్లలకు ఏమాత్రం తెలుపకూడదు. వాటిని తమ మనస్సులోనే ఉంచుకొని, పిల్లలకు ఆనందాన్ని పంచడానికి ప్రయత్నం చేయాలి. వాళ్ళను సరియైనరీతిలో అభివృద్ధికి తెప్పించాలి. పిల్లలతో

sri sathyasaivachanamrutam

చెప్పించుకొనకుండా తల్లిదండ్రులే వారికి సరియైన మార్గాన్ని నిరూపించాలి. తాము ఆదర్శవంతంగా నడుచుకొని పిల్లలకు తగినటువంటి స్ఫూర్తిని, ధైర్యాన్ని అందించాలి. పిల్లలుకూడను తల్లిదండ్రుల యొక్క అభీష్టములను గుర్తించి వర్తించాలి. వారికి ఏమాత్రం శ్రమ కలిగించ కూడదు. తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని వారిని సాకుతూ వస్తారు. తమకు ఎన్ని కష్టములు ఉండినప్పటికీ వాటిని మనసులోనే దాచిపెట్టుకొని, పిల్లలను ఆనందపెట్టడానికి కృషి చేస్తుంటారు. అటువంటి పరిస్థితిలో పిల్లలు తల్లిదండ్రులకు ఏ కించిత్ బాధ కలిగించినా వాళ్ళు క్రుంగిపోతారు. "తల్లిదండ్రులయొక్క త్యాగముచేతనే నేనింత అభివృద్ధికి వచ్చాను" అనే కృతజ్ఞతా భావం పిల్లల్లో భద్రంగా ఉండాలి.

Tell me your company, I shall tell you what you are అన్నట్లుగా, మీరు ఎలాంటివారో మీ స్నేహితులను చూస్తే తెలుస్తుంది. కనుక, మీరు చెడ్డవారితో ఏమాత్రం చేరకూడదు. తల్లిదండ్రులను ఆనందపెట్టే మార్గంలో మీరు జీవితాన్ని నడుపుకోవాలి. మీరు పెళ్ళి చేసికొని ఫ్యామిలీ లైఫ్‌లో ప్రవేశించిన తరువాతకూడా తల్లిదండ్రులకు ఎలాంటి బాధలూ లేకుండా చూసుకోవాలి. 'నా ఫ్యామిలీ, నేనూ బాగుంటే చాలు. నా తల్లిదండ్రులు ఎట్లుంటే నాకేమిటి!' అని వారిని అలక్ష్యం చేయకూడదు. అది చదువు లేని మూర్ఖులు చేసే పని. చదువుకున్నవారు ఆవిధంగా చేయకూడదు. అవసరమైనప్పుడు మీరు తల్లిదండ్రుల దగ్గరకు పోయి, వారికి సేవ చేసి, వారి అభీష్టములను కనుక్కొని, వారిని సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి. తల్లిదండ్రులను ఆనందపెట్టడం పిల్లలయొక్క ప్రధానమైన కర్తవ్యం. మీ తల్లిదండ్రుల అవసరాలను మీరు జాగ్రత్తగా చూసుకోవాలి. ఆవిధంగా చూసుకోనటువంటివారిని మీరు గట్టిగా మందలించి సరియైన మార్గంలో పెట్టాలి. ఈనాడు జగత్తులో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య భేదాలు చెలరేగుతున్నాయి. తల్లిదండ్రులయొక్క ఆశలు వేరుగా ఉంటాయి; పిల్లలయొక్క అభిరుచులు వేరుగా ఉంటాయి. కాని, మీయొక్క అభిరుచిని మాత్రమే మీరు చూసుకుంటూపోతే మీ తల్లిదండ్రుల మాటేమిటి? మీ తల్లిదండ్రులయొక్క అభీష్టాలను అనుసరిస్తూ మీరు తప్పక మీ కోరికల్ని నెరవేర్చుకోవచ్చు. తల్లిదండ్రులను దుఃఖపెట్టి, కేవలం మీ తృప్తికోసం మీరు ప్రయత్నిస్తే, అది పూర్తిగా

sri sathyasai vahini amrutam

స్వార్థమనిపించుకుంటుంది. ఇటువంటి స్వార్థం పెరిగిపోవడంచేతనే ఈనాడు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సంబంధ బాంధవ్యము క్షీణిస్తున్నది. ఇది కొడుకులు చేయవలసినటువంటి పని కాదు. అలాంటి పిల్లలను తల్లిదండ్రులుకూడను మందలించి సరియైన మార్గంలో పెట్టాలి. ఈనాడు నీవు పెండ్లి చేసుకొన్న తరువాతనే నీకు అత్తమామలు వచ్చారు. కాని, మొదటినుంచి ఉన్నవారు నీ తల్లిదండ్రులు. కాబట్టి, వారిని మొట్టమొదట సంతోషపెట్టాలి.

ఇంతియేకాదు. మీరు బయటివారి విషయాలలో ఎక్కువగా ప్రవేశించ కూడదు. మొట్టమొదట ఇంట్లో మీ తల్లిదండ్రులయొక్క పరిస్థితిని గుర్తించి వర్తించాలి. కాని, ఈ కలి ప్రభావముచేత పిల్లలు తల్లిదండ్రులను దూరంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తుంటారు. పిల్లల్లో 'టెన్షన్, టెంపర్' – ఇలాంటివి పెరుగుతున్నాయి. కోపాన్ని తగ్గించుకోవాలి. మీ తల్లిదండ్రులపైనా మీరు కోపం చూపడం! చాలా తప్పు. ఎవరు మీ మంచి కోరుతున్నారో వారిపై మీ టెన్షన్‌ను, టెంపర్‌ను ఏమాత్రం చూపకూడదు. మీకు అనేకవిధాలుగా సహాయం చేసిన మీ తల్లిదండ్రులకు, దైవానికి మీరు తగినటువంటి కృతజ్ఞత చూపాలి. వృద్ధులైన మీ తల్లిదండ్రులకు కంటిధారలు కారనివ్వకూడదు. వారిని సంతోషపెట్టినప్పుడు మీకూ సంతోషం కలుగుతుంది.

చిన్నపిల్లలకు బాలవికాస్ శిక్షణ చాలా అవసరం. మొట్టమొదట తల్లిదండ్రులు మానవతా విలువలను గుర్తించి వర్తించాలి. తాము ఏది చెపుతున్నారో అది స్వయంగా చేసి చూపించాలి. అప్పుడే తమ పిల్లలకు బోధించే అధికారం వారికి వస్తుంది. "మాకు టైమ్ లేదే, మేము ఆఫీసుకు పోవలసివస్తుందే" అని మీరు అనుకుంటారు. కేవలం మీ ఆఫీసు పనే మీరు చూసుకుంటే ఇంక మీ పిల్లలయొక్క గతి ఏమిటి? పూర్వం నేనొక పద్యము వ్రాసి ఉంటిని.

**ఉద్యోగములుచేయ నువిదలందరుబోవ**<br>
**గృహకృత్యములు తీర్చ గృహిణులెవరు**<br>
**ఆలుమగ లిరువురు ఆఫీసులకు బోవ**<br>
**ఇంటిలో నుండెడి ఇంతు లెవరు?**

sri sathyasai vahanamrutam

**పర బాలురకు నేర్ప పాఠశాలల కేగ**
**తమ బాలురకు నేర్పు తల్లులెవరు?**
**పుస్తకాల్ చేపట్టి పురుషులవలె బోవ**
**వంటి ఇంటిని దిద్దు వనిత లెవరు?**
**డబ్బు లేనియట్టి యిబ్బంది తీరిన**
**ఇంటిలోని కొరత ఎంతయుండు!**
**సుఖము చూడబోవ సున్నయే ఉద్యోగ**
**పదవియందున్న పడతి కెపుడు**

చదువుకున్నటువంటి ఆడపిల్లలు ఉద్యోగం చేయాలని పోతుంటారు. తల్లులు ఉద్యోగాలకు వెళ్ళిపోతే, ఇంటి పనులు ఎవరు చేస్తారు? "ఆలుమగలిరువురు ఆఫీసులకు పోవ పిల్లలను పోషించు తల్లులేరి?" పిల్లలను చూసుకోవడానికి ఆయాను పెట్టేస్తారు. కాని, ఆమె పిల్లలను వారి కన్నతల్లి మాదిరి ప్రేమతో చూసుకుంటుందా? కనుక, ఉద్యోగమైనా మానేసి తల్లులే పిల్లలను చూసుకోవాలి. "పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ వంట ఇంటిని దిద్దు వనితలేరి?" ఆఫీసు నుంచి వంట మనిషికి ఫోను చేస్తారు, "మేము ఐదు గంటలకు ఇంటికి వస్తాము, టీ రెడీ చేసి పెట్టు" అని. అసలు టీ తయారుచేయడానికి కావలసిన సామాను ఇంట్లో ఉన్నదా లేదా అన్నది వాళ్ళు పట్టించుకోరు. ఆఫీసునుండి ఇంటికి వస్తూనే న్యూస్ పేపరు చదువుతూ, టీవీ చూస్తూ కూర్చుంటారు. కొంతమంది ఇంటికి రాకుండా క్లబ్బులకు పోయి పిచ్చిపిచ్చి ఆటలు ఆడుతుంటారు. ఇవన్నీ వారికే అగౌరవాన్ని కలిగిస్తాయి. ఇలాంటివాళ్ళు పిల్లలను ఏరీతిగా బాగుపరచగలరు? కనుక మీరు మొట్టమొదట మీ ఇంటి పరిస్థితులను చక్కబెట్టుకొని తరువాతనే బయటి పరిస్థితులపై దృష్టిపెట్టాలి. ఇంట్లో పిల్లలకు ఏవిధమైనటువంటి అవస్థలూ లేకుండా ఉంటే తల్లికూడను తప్పక ఉద్యోగం చేసుకోవచ్చు, తప్పు లేదు. కాని, పిల్లలను ఆయాపైన, వంటవారిపైన వదలిపెట్టిపోవడం మంచిది కాదు. పిల్లలను చూసుకోవడం తల్లిదండ్రులయొక్క ప్రధానమైనటువంటి బాధ్యత. తల్లి ఆఫీసుకు పోతే ఏదో కొంత డబ్బు సంపాదించవచ్చు, కాని, దానికి తగినటువంటి ఖర్చుకూడా

srisathyasaivachanamrutam

ఉంటుంది. ఆయాకు, వంటవాళ్ళకు జీతాలు ఇవ్వవలసివస్తుంది. అంతేకాకుండా, ఇంట్లో అనేక సామాన్లు పోతూ ఉంటాయి. ఇంక, మీకు మిగిలేది ఏమిటి? ఇది మగవాళ్ళు ఎవరూ విచారించడం లేదు. ఇంటికి వస్తే ఒక్కొక్కసారి కాఫీ తాగడానికి కప్పులుకూడా ఉండవు. అలాంటి పరిస్థితిలో నీవు ఉద్యోగం చేసి ప్రయోజన మేమిటి? మీరు డబ్బుకోసం చూస్తున్నారేగాని, మీ అనుకూలాలను, మీ పిల్లల భవిష్యత్తును చూసుకోవడం లేదు. పిల్లలు బాగా చదవటంలేదంటే అది వారి దోషం కాదు, తల్లిదండ్రుల యొక్క దోషమే! కనుక, తల్లులు ఇంట్లోనే ఉండి పిల్లలను బాగా చూసుకోవాలి. వాళ్ళ అభివృద్ధికి రావడమే మీరు కోరవలసిన 'ఇన్‌కమ్' (ఆదాయం). ఆ 'ఇన్‌కమ్'ని పోగొట్టుకొని, పిల్లలను పాడుచేసిపెట్టి, కేవలం డబ్బుకోసం పాటుపడితే మీరు స్వార్థపరులయిన తల్లిదండ్రులవుతారు. తరువాత మీ బిడ్డలు చెడిపోతే మీరు ఎంతో బాధపడవలసివస్తుంది. కనుక, మనము పిల్లలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి.

మానవతా విలువలను ఎవరంతట వారు స్వచ్ఛందంగా అనుసరించాలి. పెద్దలు న్యాయంగా ప్రవర్తిస్తూ ఉంటే, సమాజంలో అన్నీ సక్రమంగా ఉండేటటు వంటివి. కాని, ఈనాడు పెద్దలు న్యాయంగా ప్రవర్తించడం లేదు. వారు చేస్తున్న దోషములయొక్క ఫలితాలను పిల్లలు అనుభవిస్తున్నారు. మొట్టమొదట పిల్లలను అభివృద్ధికి తీసికొనివచ్చి, ఆనందపెట్టడానికి తగినటువంటి చర్యలు తీసుకోవాలి. పిల్లలు ఉదయం ఎనిమిది గంటలవరకు నిద్రపోయేటట్లు వాళ్ళకు మనం అలవాటు చేయకూడదు. వాళ్ళను తెల్లవారుఝామున ఐదు గంటలకే నిద్ర లేపాలి. కాని, ఈనాడు తల్లిదండ్రులుకూడను ఐదు గంటలకు లేవడం లేదు. తల్లిదండ్రులు 8 గంటల వరకు పడుకుంటారు కాబట్టి, పిల్లలు 9 గంటలవరకు పడుకుంటారు.

పాఠశాల నడుపుతున్నప్పుడు మనం మూలధనాన్ని ఏర్పాటు చేసుకోవచ్చును. పిల్లలయొక్క తల్లిదండ్రుల సహాయం తీసుకోవచ్చును. ఒకరికొకరు హెల్ప్ చేసుకోవచ్చును. సాయి విద్యాసంస్థలలో డిసిప్లిన్, డివోషన్, డ్యూటీ (క్రమశిక్షణ, భక్తి, కర్తవ్యపాలన) ఈ మూడింటినీ మంచిగా పెంచుకోవాలి. మానవతా విలువలను, భగవంతునితో స్నేహాన్ని అభివృద్ధి చేసికొనే మార్గాన్ని మనం పిల్లలకు చక్కగా బోధించాలి. ఇష్టమొచ్చినట్లుగా, వాళ్ళ

కోరినవిధంగా వాళ్ళకు ఫ్యాషన్ డ్రస్సులు కుట్టించకూడదు. ఏది ఎంతవరకు అవసరమో గమనించి దానికి తగినట్లు మసలుకోవడం పిల్లలకు మనం నేర్పించాలి. అప్పుడే వారు అదుపులో నిలుస్తారు. పిల్లలను అదుపులో పెట్టుకోవడం తల్లిదండ్రులయొక్క బాధ్యత. సాయి విద్యావిధానమంటే ఏమిటో తల్లిదండ్రులకుకూడను మనం చక్కగా తెలియ జెప్పాలి. ఎందుకంటే, కొంతమంది తల్లిదండ్రులకు ఈ విద్యావిధానముగురించి ఏమీ తెలియకుండా ఉండవచ్చును. స్కూల్‌లో తమ పిల్లలకు ఏమి చెపుతున్నారో ఏమిటో అనే సందేహం కూడా వారికి రావచ్చును. కనుక, సాయి స్కూల్‌లో చదివే విద్యార్థులు కూడను తమ తల్లిదండ్రులకు సాయి విద్యావిధానము గురించి వివరంగా తెలియజెప్పాలి.

కొందరు పిల్లలు తల్లిదండ్రులకు భయపడి కొన్ని అబద్ధాలుకూడా చెపుతారు. పరీక్షలో వాళ్ళకు 20 మార్కులొస్తే, ఇంటికి వచ్చి 50 మార్కులొచ్చాయని చెపుతారు. తల్లిదండ్రులు వారి మాటలు నమ్ముతారుగాని, స్కూలుకు వెళ్ళి చూడరు. పిల్లలు చెప్పేది సరిగా ఉందా లేదా అని అప్పుడప్పుడు స్కూలుకి వెళ్లి చెకప్ చేయాలి. అది పిల్లలకు తెలియనివ్వకూడదు. కనీసం వారానికి ఒకతూరి స్కూలుకి పోయి, పిల్లలు ఏవిధంగా నడుచుకుంటున్నారు, ఏవిధంగా చదువుతున్నారు అనే విషయాన్ని చక్కగా గమనించాలి. పల్లెల్లో తల్లిదండ్రులు పిల్లలను అవసరమైనప్పుడు దండిస్తూ వారికి చక్కని క్రమశిక్షణ నేర్పుతారు. కాని, పట్టణాల్లో ఉన్నవాళ్ళు, ముఖ్యంగా ఆఫీసర్లుగా ఉన్నవాళ్ళు పిల్లలపట్ల అసలు శ్రద్ధ వహించరు. పిల్లలు పెడమార్గం పట్టకుండా వారు జాగ్రత్తగా చూసుకోవాలి.

పిల్లలు తమకు మరొక పని లేనప్పుడు పుస్తకాలు ముందరపెట్టుకొని చదువుకోవటానికి కూర్చోవాలి. కాని, ఆ పని చేయరు; బజార్లలో కుక్కల మాదిరి తిరుగుతుంటారు. అటువంటివాడు 'స్టూడెంట్' కాదు, కేవలం 'స్టుపిడ్'! పిల్లలు అనవసరంగా బయట తిరుగకూడదు. ఇంట్లోనే ఉండి చదువుకొంటూ తమ గౌరవ, మర్యాదలను కాపాడుకోవాలి.

అంతేకాదు, పిల్లలు ఇష్టమొచ్చినట్లుగా ఖర్చు పెడుతుంటే తల్లిదండ్రులు వారిని కొంత అదుపులో పెట్టాలి. 'నీవు ఈవిధంగా ఖర్చు పెట్టడం మంచిది కాదు' అని చెప్పాలి. ఏది రైటు, ఏది రాంగు అనేది చెప్పి వాళ్లను సరిచేయాలి. ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు కలసిమెలసి ఒద్దికగా ఉండాలి. కొన్ని ఇళ్ళల్లో తల్లిదండ్రులు చెప్పినట్లు పిల్లలు వినరు, పిల్లలు చెప్పినట్లు

sri sathyasai vahini

తల్లిదండ్రులు వినరు. ఏమి ప్రయోజనం? ఒకరితో ఒకరు తర్కించుకొని ఏది రైటు, ఏది రాంగు అనేటటు వంటిది విచారించాలి. ముఖ్యంగా పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. వాళ్ళు ఏ పుస్తకాలు చదువుతున్నారు? అనేది గమనించాలి. 'పిల్లవాడు తన టెక్స్‌ట్ బుక్ చదువుతున్నాడులే' అనుకుంటాము. కాని, ఆ టెక్స్‌ట్ బుక్ మధ్యలో వాడు ఏదైనా పిచ్చి నవల పెట్టుకొని ఉండవచ్చు. అది వాడి పిచ్చి టేస్ట్! తక్షణమే ఆ పిచ్చి పుస్తకాన్ని తీసి పారవేయాలి. ఇటువంటివన్నీ మనం జాగ్రత్తగా గమనించి పిల్లలను సరిదిద్దినప్పుడే వాళ్ళు మంచి అభివృద్ధికి రాగలరు.

'డోన్ట్ వేస్ట్ మనీ, డోన్ట్ వేస్ట్ ఫుడ్, డోన్ట్ వేస్ట్ ఎనర్జీ, డోన్ట్ వేస్ట్ టైమ్' (డబ్బు, ఆహారము, శక్తి, కాలము – ఈ నాల్గింటినీ వ్యర్థం చేయవద్దు). ఇదే 'సీలింగ్ ఆన్ డిజైర్స్' (కోరికలపై అదుపు) అంటే. ఇది మానవుణ్ని ఎంతైనా అభివృద్ధికి తెస్తుంది. కాని, ఈనాడు 'సీలింగ్ ఆన్ డిజైర్స్' అనేది పెద్దవారికీ లేదు, పిల్లలకూ లేదు. ఎంతో డబ్బు వేస్ట్ చేస్తున్నారు. ఏదైనా ఒక డిన్నర్ ఏర్పాటు చేస్తే దానికొరకు కొన్ని లక్షలు ఖర్చు పెడతారు. ఈవిధంగా డబ్బును దుర్వినియోగం చేయటం మంచిదికాదు. అట్లే, ఆహారాన్నికూడా వేస్ట్ చేయకూడదు. మనం తిన్న తరువాత మిగిలినదానిని ఎవరైనా బీదలకు పెట్టాలి; అంతేగాని, వ్యర్థంగా పారవేయ కూడదు. ఎవరికైనా పెట్టినప్పుడు వాళ్ళు ఎంతగా ఆనందిస్తారో, అంతకు రెట్టింపు ఆనందాన్ని మనముకూడా పొందుతాము. చాలామంది తాము తిన్న తరువాత ప్లేటులో కావలసినంత పారవేస్తారుకాని, ఆకలిగొన్నవాళ్ళకు కించిత్తైనా పెట్టరు.

ఆహారం విషయంలోగాని, డబ్బు విషయంలోగాని ప్రతి ఒక్కదానికికూడను ఒక పరిమితి పాటించాలి. అప్పుడు మనకే ఎంతో మేలు కలుగుతుంది. మితంగా మాట్లాడాలి. టైమ్ వేస్ట్ చేయకూడదు. టైమ్ వేస్ట్ చేస్తే జీవితాన్ని వేస్ట్ చేసినట్లే! ఈనాడు అనేకమంది డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. Misuse of money is evil. అవసరమైతే ఖర్చు పెట్టవచ్చుగాని, అవసరం లేకపోయినా జేబులో డబ్బు ఉందని ఊరకే ఖర్చు పెట్టవచ్చునా? తప్పు కాదా? కొందరు తమకు జీతం బాగా వస్తోందని దానిని ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టేస్తారు. వాళ్ళు ఆడంబరాలకు పోతుంటే వాళ్ళను చూసి చిన్నక్లాసువాళ్ళుకూడను ఆడంబరాలకు పోయి, తమకు వచ్చే డబ్బు చాలక జీతాలు పెంచమంటారు. వాళ్ళు

ఈవిధంగా పెడమార్గం పట్టడానికి మనం కారకులం కాకూడదు. అందరికీ సుఖం కలిగించే మార్గాన్ని చూపాలి. నీకేం?! 'పోతే పోయిందిలే' అని ఖర్చుపెడతావు. కాని, అట్లా ఖర్చుపెట్టకూడదు. ఇది సద్వినియోగమా? దుర్వినియోగమా? అని యోచించి ఖర్చు పెట్టాలి. సొసైటీలో మనం ఏ కించిత్ తప్పు చేసినా అది పెద్దదిగా భావిస్తారు. కనుక, మనం కించిత్‌కూడను తప్పు చేయకుండా అతి జాగ్రత్తగా జీవితాన్ని గడపాలి.

**– తేదీ 21.7.2008, శ్రీ సత్యసాయి ప్రపంచ విద్యా సమ్మేళనం, సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vachanamrutam